క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి భక్తిని చాటుకున్నారు. భక్తులు రూ.2 లక్షల వరకు విరాళాలను అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదోని వాస్తవ్యులు కె.అయ్యన్న ఆచారి కుటుంబ సభ్యులు రూ.లక్ష, ఎస్.కృష్ణరావు కుటుంబ సభ్యులు రూ.లక్ష, అలాగే నిత్యాన్నదాన కార్యక్రమానికి కర్నూలుకు చెందిన పద్మావతి, వెంకటరామిరెడ్డి కుటుంబసభ్యులు రూ.50,116లను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలు, బెండు, స్వామివారి ఫొటోను అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాంజల చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని రాంజల చెరువును ఆదివారం సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావిరాజు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు హర్షద్, షేక్షావలి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు మాట్లాడుతూ.. ఆదోని పట్టణ ప్రజలకు మంచినీటి సమస్యను పరిష్కరించాలన్నారు. చెరువులో అంతా అపరిశుభ్రంగా ఉందని, కలుషిత నీరు సరఫరా అవుతున్నాయన్నారు. చెరువులోని చెత్తాచెదారాన్ని తొలగించి, నీరు కలుషితం గాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం వల్ల శిథిలావస్థకు చేరుకుందన్నారు. మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాంజల చెరువు చుట్టుపక్కల ఉన్న ఖాళీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి మున్సిపల్ కౌన్సిల్ ప్రయత్నించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఆదోని మీదుగా రైలును నడపాలి

ఆదోనిసెంట్రల్: ఈనెల 31వ తేదీ నుంచి మంత్రాలయం–మచిలీపట్నంమధ్య నడిచే రైలును కర్నూలు మీదుగా గాకుండా ఆదోని మీదుగా నడపాలని పట్టణ ప్రజలు రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ.. ఆదోని పట్టణం రెండో ముంబాయిగా పేరుగాంచిందన్నారు. ఇక్కడ వ్యాపారస్తులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. వివిధ పనుల నిమిత్తం విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారన్నారు. ఆదోని మీదుగా ఆ రైలును నడిపితే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆదివారం ఆదోని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని కోరారు. కాలనీలో 5,101 ఇళ్లు మంజూరు కాగా, అందులో 237 ఇళ్లు టాప్ వేయగా, 110 ఇళ్లు రూమ్ లెవెల్‌లో ఉన్నాయని, 47 లెంటల్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. 3,410 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లోనూ, మిగిలిన వివిధ దశల నిర్మాణాల్లో జరుగుతున్నాయన్నారు. నిర్మాణాల్లో వేగం పెంచాలని సూచించారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి



మృతుడు వెంకటేష్

పరిగి: మద్యం మత్తులో కింద పడి కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూలి పనులతో జీవనం సాగిస్తున్న కర్నూలు జిల్లా నందవరానికి చెందిన వెంకటేష్ (53), రెండు నెలలుగా పరిగి మండలం హిందూపురం–మడుగిరి ప్రధాన రహదారిపై వంతెన విస్తరణ పనులకు వెళుతున్నాడు. మద్యం అలవాటు ఉన్న ఆయన శనివారం రాత్రి అతిగా మద్యం సేవించి పెద్దిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసుకున్న షెడ్డు వద్ద కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విచారణలో మృతుడిని వెంకటేష్‌గా నిర్ధారించుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పరిగి ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

'ఆహా'.. ఏమి రుచి

- ప్రజలకు తక్కువ ధరకే ఆహారం
- ఆహా క్యాంటీన్లలో రుచి, శుచి, నాణ్యత

ఆదోని సెంట్రల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ఇప్పుడు మహిళా సమాఖ్య సభ్యులకు ఉపాధి చూపించాలనే లక్ష్యంతో 'ఆహా' క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చి పోయే వారు, మార్కెట్లకు సరుకులు తెచ్చే రైతులు. వ్యాపారుల ఆకలి తీర్చేందుకు తక్కువ ధరతో రుచికరమైన ఆహారం అందించేందుకు నడుం బిగించింది. ఆదోని పట్టణంలో ఆహా క్యాంటీన్ల ఏర్పాటుపై ఆసక్తి ఉండి ముందుకు వచ్చిన మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించి రెండు క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఒకటి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద, మరొకటి టూ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద పెట్టారు. సభ్యులు పులిహోర, పెరగన్నం వంటివి ఇంటి వద్దనే తయారు చేసుకొని మధ్యాహ్నం వేళ రూ.20కే ఆయా సెంటర్లలో విక్రయిస్తున్నారు. హోటళ్లలో టిఫిన్ చేసినా రూ.40 నుంచి రూ. 50 దాకా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో తక్కువ ధరకే ఇంటి ఆహారం దొరుకుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్యాంటీన్ ఏర్పాటుకు రూ.13 వేలు ప్రభుత్వ సాయం

'ఆహా' క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 13 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులలో సాధ్యమైనంత ఎక్కువ మందికి ఉపాధి చూపించాలన్న లక్ష్యంతో మెప్మా కృషి చేస్తోంది. క్యాంటీన్ల నిర్వాహకులు ప్రతినెలా రూ.500 చొప్పున స్థానిక పట్టణ మహిళా సమాఖ్య సొసైటీలో జమ చేసి మరింత మందికి ఆర్థిక సాయం అందేలా ఏర్పాట్లు చేశారు. ఆహారాన్ని రుచి, శుచిగా ఇంటి వద్దే వండి ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో విక్రయిస్తారు.



ఆహా క్యాంటీన్‌లో భోజనం తింటున్న ప్రజలు

ఆహారం రుచికరంగా ఉంది



ఆహా క్యాంటీన్‌లో విక్రయించే ఆహారం మంచి రుచికరంగా ఉంది. రూ.20కి టిఫిన్ కూడా దొరకని రోజుల్లో తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. ఆయా పనుల నిమిత్తం వచ్చి పోయే వారు, పెద్ద హోటళ్లకు వెళ్లి భోజనం చేయలేని సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆహా క్యాంటీన్లలో ఆకలి తీర్చుకొవచ్చు. ఇంటి భోజనం తిన్నట్లుగా ఉంటుంది.

– రామచంద్రయ్య, పెద్ద హరివాణం

ఇంటి వద్ద తయారు చేసి తీసుకొస్తాం



తక్కువ ధరకే ఇంటి ఆహారం అందించాలనే లక్ష్యంతో అధికారులు ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఇంటి వద్దనే పులిహోర, చిత్రన్నం, పెరగన్నం వంటివి తయారు చేసి తీసుకొస్తాం. ప్రస్తుతం మధ్యాహ్నం పూట మాత్రమే ఆహారం విక్రయిస్తున్నాం. ఆసుపత్రులకు, మార్కెట్లకు వచ్చి పోయే వారు తింటున్నారు. వ్యాపారం బాగా జరుగుతుంది. త్వరలో టిఫిన్లు కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

– నిర్మల, నిర్వాహకురాలు

మహిళలకు చేయూతనిస్తున్న ప్రభుత్వం



రాష్ట్రంలోని మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేయుతనిస్తూ ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇప్పటికే పట్టణాల్లో జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మార్టులను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అదే బాటలో ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేయించాం. ఇందులో వచ్చిన లాభాలు నిర్వాహకులే తీసుకుంటారు. ప్రభుత్వం పొదుపు సంఘాలకు బ్యాంకుల ద్వారా వివిధ రకాల రుణాలను అందించి వారిని మరింత బలోపేతం చేస్తోంది.

– సమీనా, సీఎంఎం

ఘనంగా కుంభోత్సవం



కుంభం ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

హొళగుంద: శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా మండల కేంద్రంలో భీరలింగేశ్వర స్వామి కుంభోత్సవం కురువ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గ్రామంలోని పెద్దబావి వద్ద గంగి పూజ అనంతరం భక్తులు కుంభాన్ని వీధుల్లో ఊరేగింపుగా స్థానిక ఈర్లకట్ట వద్ద వెలసిన భీరలింగేశ్వర స్వామి ఆలయ వద్దకు తీసుకొచ్చారు. ఆలయంలో ఆకుపూజ, మహామంగళారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు జరిగాయి. నిర్వాహకులు, కురువ కులపెద్దలు భక్తులకు అన్నదానం చేశారు.

గట్టు పవిత్రతను కాపాడుకుందాం

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన శ్రీ మాళమల్లేశ్వర స్వామి ఆలయ పవిత్రత, ఆచార సాంప్రదాయాలు, కట్టుబాట్లును అందరూ పరిరక్షించాలని దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. వచ్చే నెల 15 నుంచి 28వ తేదీ వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే నెల 24వ తేదీన విజయదశమి పండుగ నాటికి విద్యుత్ ఆదునికీకరణ, తాగునీటి ఏర్పాట్లు, రోడ్డు మరమ్మతులు పనులు పూర్తి చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, పక్కన అవోపా సభ్యులు

ఆదోనిఅర్బన్: ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్, ఆదోని ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరాం ఆస్పత్రి వారి సౌజన్యంతో ఆదివారం చిన్నశక్తి గుడి వద్ద గల జిహ్వేశ్వర పాఠశాలలో జరిగిన ఉచిత గుండె, కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించారు. శిబిరానికి రోగుల నుంచి భారీ స్పందన లభించింది. డాక్టర్లు 125 మందికి కంటి ఆపరేషన్లు, 5 మందికి గుండె ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, దాత నగేష్ కాకుబాళ్, అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిరియాల శ్రీధర్ మాట్లాడుతూ.. గుండెకు సంబంధించి ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్ కొలెస్ట్రాల్, టీజీఎల్, హెచ్‌డీఎల్, వీడీఎల్, ఈసీజీ, టూడీఏకో, టీఎంటీ పరీక్షలు డాక్టర్ల సలహా మేరకు ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి నంద్యాల శాంతిరాం ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. అవోపా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, సభ్యులు రంగ, రాఘవేంద్ర, రఘు, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, సంగీత, సభ్యులు బిందు, గీత తదితరులు పాల్గొన్నారు.

'అమ్ముల పొది' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ గావిస్తున్న సాహితీవేత్తలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న కొత్తగా రచించిన 40వ పుస్తకం 'అమ్ముల పొది' బాలగేయాల సంపుటి ఆలూరులో ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్వాల సోమన్న మాట్లాడుతూ.. సామాజిక సేవకురాలు, విశ్రాంత మండల విద్యాధికారిణి హెచ్.రామలింగమ్మ, ఎస్ఐ నాయక్ చేతుల మీదుగా ఆలూరులోని ఘాజి పబ్లిక్ స్కూల్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. పుస్తకాన్ని మానవతావాది హెచ్.రామలింగమ్మ గారికి అంకితమిచ్చినట్లు పేర్కొన్నారు. అతి తక్కువ సమయంలో 40 పుస్తకాలను ప్రచురించడమే కాకుండా బాలసాహిత్యంలో విశిష్ట సేవలకు ముఖ్య అతిథులు రచయితను కొనియాడారు. అనంతరం విశేష తెలుగు సాహితీ కృషికి గానూ సగౌరవంగా సత్కరించారు. కవులు, ఉపాధ్యాయులు, కళాకారులు కేశవయ్య, నాగేశ్వరరావు, బి.టి.లక్ష్మన్న, రవిప్రకాష్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



జొహరాపురంలో బొడ్రాయి ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఆదివారం గ్రామంలో నవగ్రహాలు, నందీశ్వరుడు, బొడ్రాయి, దత్తత్రేయ పీఠం బాల రంగ గురిడి స్వామి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు పురోహితులు లోకనాథ్ స్వామి, వీరభద్ర, గురుమూర్తి, రంగప్ప స్వాముల ఆధ్వర్యంలో శిష్య బృందం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి విగ్రహాలకు జల, ధాన్య, దీక్షహోమాలు, కూష్మాండ బలిదానం వంటి పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆదివారం ఉదయం నవగ్రహాలు, నాభి లింగ(బొడ్రాయి), నందీశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పురోహితులు విశేష పూజలు చేపట్టారు. అనంతరం స్వామి వార్లకు భక్తులు, గ్రామస్తులు పిండి వంటలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.





ప్రత్యేక అలంకరణలో మార్కండేయ స్వామి, శివ పార్వతులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న పద్మశాలి కులబాంధవులు

మార్కండేయ స్వామికి విశేష పూజలు

కోసిగి: మండల కేంద్రంలో పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం భక్త మార్కండేయ స్వామికి ఆదివారం విశేష పూజలు చేపట్టారు. ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి రామసుబ్బయ్య శాస్త్రి, ఆలయ అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, వెండి కవచ అలంకరణ, మహా మంగళ హారతులు గావించి, ఫలపుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే గణపతి, నవగ్రహ, ఆంజనేయ స్వాములకు హారతులు ఇచ్చి పూజలు చేశారు. భక్తాదులు శివ పార్వతుల విగ్రహాలకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నేడు శ్రావణ మాస మూడో సోమవారం పురస్కరించుకుని సాయంత్రం శివపార్వతిల విగ్రహాలను ఎద్దుల బండిపై కొలువుంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నారు. పద్మశాలి కుల బాంధవులు కేధారి వెంకటేష్, కర్లి మాణిక్యరాజు, గడ్డం ఈరన్న, గడ్డం శ్రీరాములు, నీలి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: గృహ, వ్యవసాయ రంగంలో విద్యుత్ వాడకం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మండల ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి సూచించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన వివిధ గ్రామాల రైతులతో మాట్లాడారు. రైతులు వ్యవసాయ విద్యుత్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంపుసెట్ల వద్ద ఏదైనా సమస్య ఏర్పడితే అధికారులకు తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. అధికారులు అందుబాటులో లేకపోతే ఎల్సీ తీసుకున్న తర్వాతే పని చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వర్షం కురిసేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



పూజలందుకున్న ఈరన్న స్వామి



తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు చేస్తున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ఉరుకుంద క్షేత్రం



సీతారామిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు




స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచే దర్శన క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. క్షేత్రంలో ఎక్కడచూసినా భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రావణమాస ఉత్సవాల్లో మూడవ సోమవారానికి ప్రత్యేకత ఉంది. ఆ రోజున సుమారు 3 లక్షల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దేవాలయ అధికారులు ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వివిపీ దర్శనం క్యూలైన్ల ద్వారా స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, కోసిగి సీఐ ఏరిషావలి, మరో ఇద్దరు సీఐలు ఆధ్వర్యంలో కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఆరుగురు ఎస్ఐలు, పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులతో గట్టి పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు.

ఈరన్నస్వామిని దర్శించుకున్న వై.సీతారామిరెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి ఆదివారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. శ్రావణమాసంలో స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆయనకు అర్చకులు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. శ్రావణమాసం మూడో సోమవారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆదివారం కుటుంబ సమేతంగా తరలి వచ్చి ఈరన్న స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్, మల్లికార్జున, వేంకటేష్, తదితరులు ఉన్నారు.



రాఘవేంద్రుల నృత్య రూపకంలో హారతులు పడుతున్న కళాకారులు



విశేష అలంకరణలో రాఘవేంద్రుల మూలబృందావనం

ఓం నమో రాఘవేంద్రాయ నమః



ధ్యానంలో భక్తుడు

మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి 352వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో 6వ రోజు ఆదివారం రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు, రాయరు పాదపూజ, మూలదేవర సంస్థాన పూజ, మఠం 13వ పీఠాధిపతి సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన చేపట్టారు. యోగీంద్ర మండపంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు ఆలపించిన గీతాలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆధ్యాత్మికత నింపాయి.

– మంత్రాలయం



భక్తి గేయాలు ఆలపిస్తున్న కళాకారులు



అలరించిన భరత నాట్య ప్రదర్శన



అశ్వ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు



కృష్ణుడి వేషధారితో పరాచికాల నృత్య ప్రదర్శన